రేవంత్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభం

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, మార్చి 10 : దగాకోరుకు మారుపేరుగా సీఎం రేవంత్ నిలుస్తున్నాడని, ఆయన పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మశాలి భవనంలో పరకాల, నడికూడ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అంటేనే దగా అని, అన్ని వర్గాలను మోసం చేయడమే ఆ పార్టీ పని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీరాంసాగర్‌లో నీటి లభ్యత లేదని, ఎస్సారెస్పీ కెనాళ్ల ద్వారా నీరందించే పరిస్థితులు లేవని ఎమ్మెల్యే రేవూరి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడుతారన్నారు. బీఆర్ఎస్‌ను వీడే నాయకులతో పార్టీకి నష్టమేమీ లేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కొంతమంది పార్టీని వీడుతున్నారని, పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో పనిచేసే కార్యకర్తలు గ్రామాల్లో ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి పాలకుల దుశ్చర్యలను ఎదుర్కొడ్డి నిలిచిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మడికొండ శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మేడిపల్లి శోభన్, గురి జపల్లి ప్రకాశ్‌రావు, దగ్గు విజేందర్ రావు, బండి సారంగపాణి, చందు పట్ల రమణారెడ్డి, చందుపట్ల తిరుపతిరెడ్డి, దామెర మొగిలి పాల్గొన్నారు.

నేడు విస్తృతస్థాయి సమావేశం

దామెర : మండలంలోని ఓగులాపురంలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరుగుతుందని వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 14 గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, మండల కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

భవిష్యత్తు మనదే..

పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలి
బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్

కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, కార్పొరేటర్లు

వరంగల్, మార్చి 10(నమస్తే తెలంగాణ): తూర్పు మాజీ ఎమ్మె ల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు ఆదివారం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ 'పార్టీ నుంచి పోయే వారిని పోనియ్యండి. ఈ సమయంలో పార్టీలో నిలబడిన వారికే భవిష్యత్ ఉంటది. ఎవరూ అధైర్య పడొద్దు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. రెట్టింపు ఉత్సాహంతో గోడకు కొట్టిన బంతిలా తిరిగి మళ్లీ ప్రజల ఆశీర్వాదం పొంది, బంగారు తెలంగాణను నిర్మించుకుందాం' అని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలందరూ కష్టపడి పని చేయాలని, తాను అన్ని జిల్లాలకూ వస్తానని, పార్టీని పటిష్ఠంగా నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, పల్లం పద్మారవి, సిద్దం రాజు, బోగి సువర్ణా సురేశ్ పాల్గొన్నారు.

రూ. 2.35కోట్ల విలువైన సీఎంఆర్ ఎగవేత

రైస్‌మిల్లు యజమానిపై కేసు

సంగెం, మార్చి 10 : ప్రభుత్వానికి సీఎమ్మార్ ఇవ్వకుండా తన సొంతానికి వాడుకున్న రైస్ మిల్లు యజమానిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని పల్లార్‌గూడలో మహాలక్ష్మీ బిన్నీ రైస్‌మిల్లు యజమాని కలకొండ యాకాంబరాచారికి 2022–23 సంవత్సరానికి గాను ప్రభుత్వం 1,534.36 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చింది. మిల్లు 1,028.021 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కానీ మిల్లు యజమాని మాత్రం ప్రభుత్వానికి కేవలం 543.905 టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చాడు. మిగతా ధాన్యాన్ని అమ్ముకుని రూ.2,35,73,935 అక్రమానికి పాల్పడ్డాడని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

ఆత్మకూరు, మార్చి 10 : శాయంపేటకు చెందిన చిల్ల నాగాంజలి ఆదివారం 108 అంబులెన్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ ముత్యాల రమేశ్, పైలట్ ముత్యాల ప్రకాశ్ తెలిపారు. నాగాంజలికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని జీఎంహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే డెలివరీ చేశారు. అనంతరం దవాఖానకు తరలించారు.

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం

- పది మంది పోతే వందమందిని తయారు చేసుకునే సత్తా పార్టీకి ఉంది
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్

సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

ఐనవోలు, మార్చి 10 : నాయకులు వస్తారు.. పోతారని, కార్యకర్తలే శాశ్వతమని, వారే బీఆర్ఎస్‌కు బలమని పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడొద్దని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. నియోజవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినా.. కొంతమంది వెన్నుపోటుదారుల వల్ల ఓడిపోయామని చెప్పారు. కొందరు పార్టీలు మారుతున్నారని, అంతమాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పదిమంది పోతే వందమంది కార్యకర్తలను తయారు చేయగలిగే సత్తా ఉన్న పార్టీ మన బీఆర్ఎస్ అన్నారు. ఎంత మంది పార్టీని వీడినా వేల సంఖ్యలో బీఆర్ఎస్ కోసం కష్టపడే కార్యకర్తలు నియోజకవర్గంలో ఉన్నారని గుర్తుచేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల గుండెల్లో సంపాదించిన తన స్థానాన్ని దూరం చేయలేరని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, వైస్ ఎంపీపీ మోహన్, దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ జయపాల్, మండల కోఆప్షన్ గుంషావలీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు పీ రాజు, ఎస్ రాజు, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు సోమేశ్వర్‌రావు, మండల ప్రచార కార్యదర్శి కోమలత, మండల నాయకుడు రాఘవులు, యూత్ అధ్యక్షుడు నరేశ్, నాయకులు సతీశ్, విక్రం, లక్ష్మణ్ గౌడ్, భాస్కర్, శ్రీను, భిక్షపతి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు

పూలే ఆశయాలను కొనసాగించాలి

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

హనుమకొండ, మార్చి 10 : విద్యా ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి సావిత్రీబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా సమాజాన్ని ప్రేమించిన వ్యక్తి సావిత్రీబాయి అని అన్నారు. విద్య ద్వారానే మహిళల్లో చైతన్యం వస్తుందని నమ్మిన ఆమె మొట్టమొదట బాలికల పాఠశాలను ప్రారంభించిందని వివరించారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నయీముద్దీన్, జానకీరాములు, లక్ష్మీనారాయణ, రవీందర్‌రావు, ప్రశాంత్, రాకేశ్, శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు.

టీచర్స్‌కాలనీ ఫేస్-2ను అభివృద్ధి చేస్తా..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : గ్రేటర్ 60వ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేజ్–2ను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాలనీని సందర్శించి సమస్యలను తెలుసుకుని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి తోడ్పడుతానన్నారు. రూ.40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు అనుకోటి పున్నం, మండల సమ్మయ్య, నాయిని లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన..

న్యూశాయంపేట : గ్రేటర్ 31వ డివిజన్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. అనంతరం డివిజన్‌లో పలు కాలనీల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు అన్నేశ్వరపు సురేందర్, కార్పొరేటర్ మామిండ్ల రాజయ్య, మాజీ కార్పొరేటర్ మోహన్ రావు పాల్గొన్నారు.

నాణ్యమైన సరాఫరాతోనే రికార్డు స్థాయి వినియోగం

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, మార్చి 10 : నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతోనే రాష్ట్రంలో సుమారు 15,623 మెగావాట్ల వినియోగంతో రికార్డు నమోదైందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో గతేడాది డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలో 33కేవీ బ్రేక్‌డౌన్స్ 506 ఉండగా, ప్రస్తుత సంవత్సరంలో కేవలం 313 మాత్రమే నమోదయ్యాయని పేర్కొన్నారు. 33కేవీ ట్రిప్పింగ్స్ 14 శాతం, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యం 25శాతం తగ్గిందన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

పిల్లలతో సహా మహిళ అదృశ్యం


పిల్లలతో స్వప్న(ఫైల్)

చెన్నారావుపేట, మార్చి 10: ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యమైన ఘటన లింగగిరిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడెల్లి రాజు జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత బుధవారం రాజు పనికి వెళ్లి ఇంటికి తిరుగొచ్చే సరికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు శ్రావణి, మనోజ్ కనిపించలేదు. నాలుగు రోజుల నుంచి బంధుమిత్రుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

నాటకాలు నిజజీవితానికి ప్రతిబింబాలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

కార్యక్రమంలో పాల్గొన్న సీపీ అంబర్ కిశోర్ ఝా

పోచమ్మమైదాన్, మార్చి 10 : నాటకాలు నిజజీవితానికి ప్రతిబింబాలుగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 23వ తెలుగు భాషా ఆహ్వాన పోటీలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దారి తప్పుతు న్న యువత వ్యసనాలకు లోనై సైబర్ నేరాలకు పాల్పడుతున్నదని, వీరిని సన్మార్గంలో నడిపించేందుకు నాటికలు తోడ్పడాలన్నారు. అలాగే, నాటికలు, నాటకాలు మానవీయ విలువలు పెంపొందించేలా ఉండాలన్నారు. అలాగే, ప్రయోజక దాతలు డాక్టర్ కేఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ ఏవీ నరసింహారావు, పరాంకుశం వెంకటకృష్ణ, మల్యాల మనోహరరావు ప్రసంగించారు. కాగా, అభినయ ఆర్ట్స్ గుంటూరు ఆధ్వర్యంలో ఎన్.రవీందర్‌రెడ్డి దర్శకత్వంలో ఇంద్రప్రస్థం నాటిక, చైతన్య భారతి కరీంనగర్ ఆధ్వర్యంలో మంచాల రమేశ్ దర్శకత్వంలో నిర్వహించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు, కుందావఝుల కృష్ణమూర్తి, డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, డాక్టర్ ఎం.రాధాకృష్ణ, పందిళ్ల అశోక్‌కుమార్, లక్ష్మణ్‌రావు, కళా రాజేశ్వర్‌రావు, జూలూరి నాగరాజు, సీత వెంకట్, నాగిళ్ల రామశాస్త్రి, రవీందర్‌రావు, మామిడి రమేశ్, సోల్జర్ షఫి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, మార్చి 10 : వివిధ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బజ్జుతండా, గుండ్లపహాడ్‌లో జాటోత్ బద్దునాయక్, గోనెల సమ్మక్క, తాటికాయల సాయిలు, కడ్దూరి కొమురయ్య మృతి చెందగా, వారి చిత్రపటాలకు పెద్ది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పార్టీ మండల మాజీ కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్‌రావు, గందె శ్రీనివాస్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సుమన్‌శర్మకు జ్యోతిష్య బ్రహ్మ అవార్డు


అవార్డు అందుకుంటున్న సుమన్‌శర్మ

గిర్మాజీపేట, మార్చి 10: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్, ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్, ఎస్ఎస్ తెలుగు ఆస్ట్రాలజీ సంయుక్తంగా నిర్వహించిన ఆస్ట్రాలజీ సెమినార్‌లో వరంగల్‌కు చెందిన డాక్టర్ సుమన్‌శర్మ ప్రతిభ కనబర్చడంతో జ్యోతిష్య బ్రహ్మ అవార్డు ప్రదానం చేశారు. అలాగే, సుమన్‌శర్మ శిష్యులు నాగరాజుశర్మ, కల్లేరు రమేశ్‌ను జ్యోతిష్యరత్న బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ తెలుగు ఆస్ట్రాలజీ వ్యవస్థాపకుడు డాక్టర్ నరసింహస్వామి పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం


శృతి (ఫైల్)

దామెర, మార్చి 10 : మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యమైన ఘటన ఆదివారం వెలుగు చూసింది. హెడ్‌కానిస్టేబుల్ రాము కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్ల శృతి (22) హనుమకొండలోని ఓ నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 9న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. శృతి తల్లి మరియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

'విద్యారంగాన్ని బలోపేతం చేయాలి'

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : విద్యారంగ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెంచిన ఫీజులను ఉపసంహరించుకోవాలని, యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులకు నెలకు రూ.30 వేల ఫెలోషిప్ అందించాలని, ఒక్కో యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, కార్యదర్శి నరసింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, మాలోత్ రాజేశ్, రవితేజ, రంజిత్, రాకేశ్ ఉన్నారు.

దర్గా హజ్రత్ పీర్ జునేద్ షా, గ్రేవీయార్డు నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

కరీమాబాద్, మార్చి 10 : దర్గా హజ్రత్ పీర్ జునేద్ షా, గ్రేవీయార్డు వరంగల్ సాకరాశికుంట నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మహ్మద్ షకీల్ అహ్మద్, ముఖ్య సలహాదారుగా ఎంఏ జబ్బార్, అధ్యక్షుడిగా మీర్జా హసన్‌అలీబేగ్, ఉపాధ్యక్షుడిగా ఎండీ మగ్దూమ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా చాంద్‌పాషా, కోశాధికారిగా అమ్జద్, సహాయ కోశాధికారిగా మొయినొద్దీన్, సహాయ కార్యదర్శులుగా సాదిక్, ఇమ్రాన్, గఫార్, ఆర్గనైజర్‌గా దస్తగిరి, సభ్యులుగా అంకూస్, యాకూబ్, సలీమొద్దీన్, నయీంను ఎన్నుకున్నారు.

చలివాగు ప్రాజెక్టులో చేపలు పట్టొద్దు


మాట్లాడుతున్న రాజమౌళి

శాయంపేట మార్చి 10 : మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టులో ఏడాది పాటు చేపలు పట్టకుండా కట్టు విధించారు. ఆదివారం ప్రాజెక్టు వద్ద జరిగిన పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు చైర్మన్ గండి రాజమౌళి తెలిపారు. దీన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు ఐరబోయిన రాజు, కార్యదర్శి మోరె నరేశ్, డైరెక్టర్లు పల్లెబోయిన సురేశ్, కుక్కల తిరుపతి, ఐరబోయిన తిరుపతి, కుక్కల ఆనంద్, అన్నబోయిన శంకర్ పాల్గొన్నారు.

గొడ్డలితో దాడి.. వ్యక్తికి గాయాలు

పరకాల, మార్చి 10 : ఆటోను మెల్లగా నడుపు.. అన్నందుకు గొడ్డలితో దాడి చేయగా వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరికొత్తపల్లి మండలం విజ్జయ్యపల్లి గ్రామానికి చెందిన బొంత సాంబయ్య మహ్మద్‌గౌస్‌పల్లికి చెందిన మిరియాల సుభాశ్‌కు రూ. 15వేల అప్పు ఇచ్చాడు. డబ్బుల కోసం తరుచూ ఫోన్ చేస్తుండడంతో సుభాష్ శనివారం ఉదయం విజ్జయ్యపల్లి గ్రామానికి వచ్చి డబ్బులు ఇస్తానంటూ సాంబయ్యను ఆటోలో తీసుకెళ్లాడు. పరకాల మండలం కామారెడ్డిపల్లి శివారులో ఆటోను మెల్లగా నడపమని సుభాష్‌కు సాంబయ్య సూచించాడు. దీంతో నాకే చెబుతావా? అంటూ సుభాష్ కోపంతో సాంబయ్యపై ఆటోలో ఉన్న గొడ్డలితో దాడి చేశాడు. సాంబయ్యను ఆటోలో నుంచి తోసేసి వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి గాయపడిన సాంబయ్యను 108 సహాయంతో పరకాల దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. సాంబయ్య భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : కేయూ గణిత విభాగంలో విద్యనభ్యసించి ప్రభుత్వ కొలువులు సాధించిన పలువురు విద్యార్థులను కేయూ రిజిస్ట్రార్, డీన్ ఆఫ్ సైన్సెస్ మల్లారెడ్డి, గణిత విభాగ అధ్యాపకులు అభినందించారు. గురుకుల డిగ్రీ లెక్చరర్లుగా ఆరుగురు, జూనియర్ లెక్చరర్లుగా 18మంది, పీజీటీ, టీజీటీలుగా ఆరుగురు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ప్రొఫెసర్ తిరుమలాదేవి, సౌజన్య, సోమయ్య, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

సందల్ ఉర్సు ప్రారంభం

కరీమాబాద్, మార్చి 10 : సందల్ ఉర్సు ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ఏకశిలానగర్‌లోని హజరత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసిమ్ షహీద్ ఉర్సు సందల్‌ను పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బా ప్రార్థనల్లో పాల్గొని పవిత్ర సమాధిపై పూలు, చాదర్ కప్పారు. అనంతరం అన్నదానం చేశారు. ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్, కమిటీ సభ్యులు మగ్దూమ్, అష్రఫ్, ఆరిఫ్, చాంద్‌పాషా, మాషుఖ్, సర్వర్, సలార్, అహ్మద్‌ఖాన్, హసన్‌అలీబేగ్, దస్తగిరి పాల్గొన్నారు.

దేవాదుల ఎయిర్‌వాల్ లీక్

ఎగిసిపడుతున్న నీరు

ధర్మసాగర్, మార్చి 10 : దేవాదుల ప్రాజెక్టు ధర్మసాగర్ పంపు హౌస్ నుంచి గండిరామారం రిజర్వాయర్‌కు వెళ్లే దేవాదుల పైపులైన్‌కు చెందిన ఎయిర్‌వాల్ లీక్ అయి నీళ్లు వృథాగా పోయాయి. జానకీపురం గ్రామ పరిధిలోని దేవాదుల పైపు లైన్ ఎయిర్‌వాల్ లీక్ కావడంతో కొన్ని మీటర్ల మేర ఎత్తులో నీళ్లు పైకి చిమ్ముతూ ఫౌంటేన్‌ను తలపించింది. కాగా, ఈ నీళ్లు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లడంతో పంటలకు నష్టం కలిగిందని రైతులు చెప్పారు. స్థానికులు దేవాదుల ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ధర్మసాగర్ పంపు హౌస్ వద్ద ఉన్న మోటర్లు ఆఫ్ చేశారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత ఎయిర్‌వాల్‌కు మరమ్మతులు చేయనున్నట్లు దేవాదుల ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

'శాంతి స్థాపనకు ఖురాన్ దోహదం'

రాయపర్తి, మార్చి 10: సమాజంలో శాంతి స్థాపనకు ఖురాన్ బోధనలు ఎంతగానో ఉపకరిస్తున్నాయని మండలకేంద్రంలోని మసీద్–ఏ–నూర్ ఇమామ్ సాహెబ్ ఇర్ఫాన్ ఆలం తెలిపారు. మసీద్ సదర్ సాహెబ్ మహ్మద్ హుస్సేన్ సాహెబ్ అధ్యక్షతన ఆదివారం మసీదు ఆవరణలో మండల స్థాయి ముస్లింల ధార్మిక సదస్సు (ముస్లింల జోడు) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖురాన్ బోధనలను ముస్లింలు తప్పక పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముస్లింలు లాయక్ అలీ, అబ్దుల్ రహమాన్, షరీఫ్, యాకూబ్‌పాషా, రఫీక్, యాసీన్, గుంషావలీ, సాహెబ్‌హుస్సేన్, రహీమొద్దీన్, అక్బర్, పర్వేజ్ ముషారఫ్, ఆసీఫ్, జుబేర్ పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

కరీమాబాద్, మార్చి 10 : రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్–కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య హంటర్‌రోడ్‌లో సుమారు 55 నుంచి 60 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖానకు తరలించారు. సమాచారం కావాల్సిన వారు 9440361941, 8712658585 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'బీజేపీ పతనం ఖాయం'

వరంగల్ చౌరస్తా, మార్చి10: రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బీజేపీ పతనం ఖాయమని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేశ్ హెచ్చరించారు. వరంగల్‌లోని తెలంగాణ రైతు భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో కొనసాగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర నాయకుడు గోనె కుమారస్వామి, జిల్లా కన్వీనర్ బాబురావు, వీరగోని శంకరయ్య, బాలరాజు, చిర్ర సూరి, ఓదెల రాజన్న, మంద రవి, ఊరటి అంశాల్‌రెడ్డి, సిరుల రవీందర్ పాల్గొన్నారు.

నేతన్న బీమాను వినియోగించుకోవాలి

గిర్మాజీపేట, మార్చి 10 : చేనేత కార్మికులు నేతన్న బీమాను వినియోగించుకోవాలని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు జీ రాఘవరావు కోరారు. చేనేత కార్మికుల కుటుంబాలకు సాంఘిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన నేతన్న బీమా పథకం నిరాటంకంగా కొనసాగుతున్నదని, దీనిపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ఆయన కార్మికులకు సూచించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

కాలిపోయిన రూ. 4 లక్షల నగదు, 5 తులాల బంగారం


మంటల్లో కాలిపోయిన నగదు

నర్సంపేట, మార్చి 10: దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామంలో రాయపురి నర్సయ్యకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. కొత్త ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చిన రూ. 4 లక్షల నగదుతోపాటు 5 తులాల బంగారం, 400 గ్రాముల వెండి కాలిపోగా, రూ. 10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు నర్సయ్య తెలిపాడు. బాధిత కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

భవానీ రుద్రుడిగా వేయిస్తంభాల రుద్రేశ్వరుడు

హనుమకొండ చౌరస్తా : భవానీ అలంకరణలో రుద్రేశ్వరుడు

మడికొండ : మెట్టుగుట్టపై త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 10 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు ప్రత్యేక పూజలతో స్వామి వారిని భవానీ రుద్రుడిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి ఆలయాన్ని సందర్శించారు. రుద్రేశ్వరస్వామి సేవాసమితి సభ్యులు గరిగె అశోక్, కట్ల రాజు, చందు, రవి, శ్రీను సేవలందించారు.

మెట్టుగుట్టపై స్వామివార్లకు త్రిశూలస్నానం

మడికొండ : మెట్టుగుట్టపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్లకు మహా పూర్ణాహుతి చేపట్టి, త్రిశూలస్నానం చేయించారు. అనంతరం అన్నపూజ చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో శేషు భారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఉత్సవ ప్రత్యేక అధికారి కవిత, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని వాహనదారుల ఆందోళన

నడికూడ, మార్చి 10 : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ శివారులోని కనకదుర్గ బంక్‌లో పెట్రోలు కల్తీ చేస్తున్నారని వాహనదారులు ఆరోపించారు. ఆదివారం కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన వాహనదారులు బైక్‌లో రూ.200 పెట్రోల్ పోసుకుని ప్రయాణిస్తుండగా మధ్యలోనే వాహనం ఆగిపోయిందన్నారు. బైక్‌లోని పెట్రోల్‌ను బాటిల్‌లో తీసి చూడగా సగం వరకు పెట్రోల్ ఉండి, మిగతా భాగం నీళ్ల మాదిరిగా ఉందని బంక్ సిబ్బందిపై గొడవకు దిగారు. పెట్రోల్‌ను కల్తీ చేయడంతో పాటు తక్కువ పెట్రోలు పోస్తున్నారని, సంబంధిత అధికారులు కనకదుర్గ ఫిల్లింగ్ స్టేషన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐలోని మల్లన్నకు పర్వత వాహన సేవ

వాహన సేవలో పాల్గొన్న భక్తులు

ఐనవోలు, మార్చి 10: ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా పర్వత వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉత్సవ విగ్రహాలను పర్వత వాహనంపై ఆలయ పురవీధుల్లో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు పురుషోత్తమశర్మ, విక్రాంగ్ వినాయక్ జోషి, అర్చక బృందం ఊరేగించారు. శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు అర్చకులు తెలిపారు. ఈవో నాగేశ్వర్‌రావు, అర్చకులు మధుశర్మ, నరేశ్‌శర్మ, భానుప్రసాద్‌శర్మ, దేవేందర్, శ్రీనివాస్, సాయిశర్మ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565